18

# 'అమ్మ కావాలి మమ్మీ'

**కా**ఫీకప్పు చప్పుడు అయ్యేలా టేబులుమీద పెట్టి లోపలికి వెళ్ళిపోయింది పద్మ.

పేపర్లో నుండి తలపైకెత్తిన రాజారావుకు భార్య కనబడలేదుగానీ ఆవిడ కోపం వినబడింది.

గదిలోకి వచ్చిన పద్మకు మంచంమీద ముడుచుకు పడుకుని వెక్కిళ్ళు పెడుతున్న కొడుకు కనబడ్డాడు.

తనమీద తనకే కోపమొచ్చింది పద్మకు.

"పసి వెధవ.. వాడిమీద చూపించింది తన ఆవేశం" అనుకుంటూ దగ్గరగా వెళ్ళి వాడిని చేతులలోకి తీసుకోబోయింది.

అమ్మ చేతికి అందకుండా దూరంగా జరిగాడు వాడు.

పనితనం వదలని పాలబుగ్గలు కన్నీటి చారికలతో తడిసి వున్నాయి. కలువరేకుల్లాటి కళ్ళు ఏడ్చి ఏడ్చి ఎఱ్ఱబడ్డాయి.

షర్టు అంచులతో ముఖం తుడుచుకున్నాడేమో చొక్కా మాసి వుంది.

"ప్రొద్దున్న నుండి పాలయినా త్రాగలేదురా కన్నా! 'ఆకలీ' అంటూ నీ బంగారు బొజ్జ ఏడుస్తోంది చూడు" లాలనగా అంది.

బాబు మమ్మీకేసి ఒకసారి చూసి, చొక్కా పైకెత్తి పొట్టవైపు చూసుకున్నాడు.

ఆవిడ మాటలతో ఆకలి గుర్తొచ్చింది వాడికి. కానీ పౌరుషంగా ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

'ఎందుకురా నన్నిలా సాధిస్తావు? వున్న ఒక్క ఆదివారం ఇలా తగలబడిపోవడం నా ఖర్మ. బోలెడన్ని పనులున్నాయి నాకు. టిఫిను తిందువుగానీ దామ్మా" అంది పద్మ కొద్దిగా విసుగ్గా.

"వాడికి స్నానం చేయించి, తిండి తినిపించేసరికి పది గంటలు దాటుతుంది. ఇంకా వంట మొదలు పెట్టనే లేదు." దిగులుగా అనుకుంది పద్మ.

"నాకు లాదే నీల్లు పోయాలి. లాదను ఎందుకు తిత్తావు?" రోషంగా అడిగాడు బాబు.

'రా' పలకడంరాని మూడేళ్ళ పసికూన తనని అలా నిలదీసి అడుగుతుంటే ఏం జవాబు చెప్పాలో తెలియలేదు పద్మకు.

"నీకు మమ్మీ అంటే ఇష్టముందా లేదా?" వాడి పక్కన కూర్చుని ఓర్పుగా అడిగింది.

"ఇష్టమే..." అనుమానంగా చూస్తూ చెప్పాడు.

బాబుకు మమ్మీ కట్టే మెత్తని చీరెల స్పర్శ ఇష్టం, ఆవిడ నవ్వు ఇష్టం, ఆమె నుండి వచ్చే పరిమళం ఇష్టం. మమ్మీకి దగ్గరగా పడుకోవడం ఇష్టం. కానీ రాధ చెప్పే కథలూ, ఆడించే ఆటలు, తినిపించే గోరుముద్దలు కూడా ఇష్టమే.

ఇవన్నీ మమ్మీకి వివరించి చెప్పే వయసు, భాష వాడికి లేవు.

"ఇంతకీ నువ్వు స్నానం చేయడానికి వస్తావా రావా?" కోపంగా అడిగింది పద్మ.

"లాను" ఖండితంగా చెప్పేసి బోర్లా పడుకున్నాడు బాబు.

"అయితే ఏడు" విసురుగా బయటకు వచ్చేసింది పద్మ.

లోపలికి వస్తున్న రాజారావు పద్మను చూడగానే తలవంచుకుని పక్కకు తప్పుకుని వెళ్ళిపోయాడు.

అతగాడి వేషాలు చూస్తుంటే ఒళ్ళుమండిపోతూంది పద్మకు.

'ఆ రాధ ఎంత అమాయకంగా కనబడుతుంది? ఇంత తెగిస్తుందని అనుకుందా తను?'

'అయినా పరాయి మనిషిని అనుకోవడం దేనికి? కట్టుకున్నవాడు ఈయనకు వుండొద్దు బుద్ధి?'

'ఇన్నేళ్ళు మీదబడి, ఇంత చదువు చదివి ఏం లాభం? మంచీ చెడూ తెలియొద్దూ?'

కోపంగా వంట పూర్తి చేసింది పద్మ. రేపటి సంగతి తలచుకుంటే మనసులో గుబులుగా వుంది. కోపంలో వెనకా ముందూ ఆలోచించకుండా ఆ పిల్లను తరిమేసింది!

'పోనీ లెమ్మని వదిలేస్తే వ్యవహారం ఎంతదూరం పోతుందో ఎవరికి తెలుసు?'

తనను తాను సమర్థించుకుంటూ మళ్ళీ గదిలోకి వచ్చింది.

బాబిగాడు బొమ్మను గుండెకు అదుముకుని నిద్రపోతున్నాడు.

'వేలెడంత లేవు.. ఎంత మొండితనంరా నాన్నా" ముద్దుగా అంటూ బొమ్మను తీయబోయింది.

నిద్రలోనే బొమ్మను మరికాస్త దగ్గరగా జరుపుకున్నాడు బాబు.

'వెధవా! నీకు బొమ్మ కావాలి గానీ 'మమ్మీ' అక్కర్లేదు, అనుకుంది.

'లేవరా నాన్నా... పన్నెండయింది. అన్నం తిందువుగానీ రామ్మా...' గోముగా వాడిని ఎత్తుకుని డైనింగు టేబులు దగ్గరకు తీసుకు వచ్చింది.

కడుపులో ఆకలి కరకరలాడుతుండటం చేతనేమో బాబిగాడు మొండి చేయకుండా కుర్చీలో కూర్చున్నాడు.

'తమరు భోజనం చేయడం మొదలు పెట్టొచ్చు' మాట్లాడకుండా అటూ ఇటూ చూస్తూ కూర్చున్న భర్తను కసిరింది పద్మ.

అన్నంలోకి పప్పు వేసి, నెయ్యివేసి మెత్తగా కలిపి చిన్న గోరుముద్ద కొడుకు నోట్లో పెట్టింది.

గభుక్కున బయటకు ఉమ్మేసాడు బాబు. "ఏమయిందిరా?" చిరాకుగా అడిగింది.

'బాలేదు. లాద కలిపితేనే బాగుంది' అన్నాడు.

రాజారావు పెదవులలో నవ్వును బంధించి, ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

పద్మ కోపంగా చూసింది అతని వైపు.

"పోనీ ఏం వేసి కలపమంటావో చెప్పు" సహనాన్ని తెచ్చుకుంటూ అడిగింది.

'లాదను ఎందుకు తిత్తావు? నువ్వు చెడ్డది." ముఖం పక్కకు తిప్పుకుని వుక్రోషంగా అన్నాడు బాబు.

మరో సమయంలో అయితే వాడి ముద్దు మాటలకు మురిసిపోయేదే... కానీ ఈరోజు విషయం వేరు.

భర్త మౌనం చూస్తుంటే పద్మకు మరింత ఒళ్ళు మంటగా వుంది.

'తనకేమీ సంబంధం లేనట్టు నంగనాచిలా ఎలా కూర్చున్నాడో..'

"సరే... ఇష్టమైతే తిను. లేకుంటే పో..." విసుగ్గా అని తన కంచంలో అన్నం కలుపు కోవడం మొదలు పెట్టింది.

'నేను లాద దగ్గలకుపోతా! కుర్చీ మీద నుండి దిగడానికి ప్రయత్నిస్తూ అన్నాడు బాబిగాడు.

"వీపు పగల కొడతా వెధవా. బ్రతిమలాడుతుంటే నెత్తికెక్కుతున్నావు.." అణచుకోలేని ఆవేశంతో వాడి వీపుమీద ఒక దెబ్బ వేసింది పద్మ.

"పసివాడు – వాడేం చేసాడని కొట్టడం? అంతదాకా వూరుకున్న రాజారావు ఇక వుండలేక అన్నాడు.

"అవును మరి వాడూ ఏమి చెయ్యలేదు. మీరు ఏమీ చేయలేదు. నాదే తప్పంతా ఉద్యోగం చేస్తే ఏదో సుఖ పడతామని ఇంటా బయటా ఊడిగం చేస్తున్నా కదూ? అందుకే మీకు అలుసైపోయాను..." పద్మ గొంతు గాద్గదికమయింది. కళ్ళలో నీళ్ళునిండాయి.

"ఛ ఛ.. ఏం మునిగిపోయిందని ఇంత రాద్ధాంతం చేయడం? ఎవరో ఏదో అన్యాయం చేసేసినట్టు ఎందుకా ఉక్రోషం?" గొంతుపెంచి విసుగ్గా అన్నాడు.

బాబిగాడు బిత్తరపోయి నాన్నవైపు మమ్మీ వైపు మార్చి మార్చి చూస్తున్నాడు.

"ఆహా! ఏం వెనకేసుకొస్తున్నారండీ? ఇప్పటికి ఏమీ జరగలేదు... నేను కళ్ళుమూసుకుని వుండిపోతే ఏం జరిగేదో..." వెకసక్కెంగా అంది.

"అర్థంలేకుండా మాట్లాడకు. అసలు నేనేం చేసానని?..." కోపంగా లేచి వెళ్ళిపోయాడు రాజారావు.

జరిగింది తలచుకుంటే ఒళ్ళు మండిపోతోంది పద్మకు.

మొన్న సాయంత్రం పద్మ ఆఫీసు నుండి వచ్చేసరికి రాధ బాబిగాడు ఆడుకుంటున్నారు. బాబు కళ్ళకు గంతలు కట్టుకుని రాధను పట్టుకోవాలని హాల్లో అటూ ఇటూ పరిగెడుతున్నాడు.

వరండాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు రాజారావు.

అతని ఆఫీసు దగ్గరే కావడాన భార్య కంటే ముందే వస్తాడు.

కళ్ళకు కట్టిన బట్టను కొంచెం పక్కకు తప్పించి పరుగున వెళ్ళి రాధను పట్టుకున్న బాబి ఆ సంతోషాన్ని పంచుకుంటూ అరిచాడు, "నాన్నా... అమ్మ దొంగ అయింది" అంటూ.

అప్పుడే లోపలికి వచ్చిన పద్మ షాక్ తిన్నట్టు నిలబడిపోయింది.

రెండు నిముషాల తరువాత తేరుకుని 'ఎవర్రా అమ్మ?' కోపంగా బాబిగాడి భుజం పట్టుకుని కుదుపుతూ అడిగింది.

'లాద' అన్నాడు వాడు పొంగివస్తున్న ఏడుపు గొంతులో అడ్డుపడుతుండగా.

రాజారావు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ఈ మధ్య కొన్నాళ్ళుగా బాబు రాధను అప్పుడప్పుడు 'అమ్మా' అనడం చెవినబడినా అతడు అంతగా పట్టించుకోలేదు. పద్మను వాడు మమ్మీ అంటాడుగనుక అతనికి అది పెద్ద విషయంగా అనిపించలేదు.

పద్మ ప్రతిస్పందన చూసేసరికి తన పొరబాటు అర్థమయ్యింది అతనికి.

పద్మ అరుపులతో అతను వులికి పడ్డాడు. "ఏమే! కూటికి లేనిదానివి నీవు తిండీ బట్టా ఇచ్చి, ఇంత జీతంతో పనికి పెట్టుకుంటే విశ్వాసమన్నా లేకుండా ఇలాటి పనిచేస్తావా? తక్షణం బయటకు నడు.. మళ్ళీ నాకు కనబడకు.." అంటూ పర్సులోనుండి డబ్బు తీసి నెల జీతం ఆ పిల్ల ముఖాన కొట్టింది.

బాబు ఏడుపు అందుకున్నాడు. రాజారావు ఈ రాద్ధాంతం నచ్చనట్టు లోపలికి వెళ్ళిపోయాడు.

అదిగో అప్పటి నుండీ ప్రయత్నిస్తోంది పద్మ వాడిని దగ్గరకు తీయాలని.

గడచిన సంవత్సరకాలంగా బాబుకు నీళ్ళు పోయడం, తలదువ్వడం, అన్నం తినిపించడం, నిద్ర పుచ్చడం అన్నీ రాధే చేస్తూవచ్చిందేమో బాబు ఆ పిల్లకు బాగా చేరువయ్యాడు.

* * *

తల్లి కళ్ళనీళ్ళు పెట్టుకోవడం చూసిన బాబు రాత్రి పేచీ పెట్టకుండా అన్నం తిన్నాడు.

తరువాత హాల్లో తండ్రి దగ్గర కూర్చుని బొమ్మలతో ఆడుతూ అక్కడే నిద్రపోయాడు.

కొడుకును ఎత్తుకుని వచ్చి పద్మ పక్కన పడుకోబెట్టాడు రాజారావు.

'కన్నా' అంటూ వాడిని దగ్గరకు తీసుకుంది పద్మ.

నిద్ర నుండి లేచి తల్లికి దూరంగా జరిగి పడుకున్నాడు బాబు.

వాడికి ఇంకా అలక తగ్గలేదని గ్రహించిన పద్మ లాలనగా వాడితో అంది "బాబీ! నీకు మమ్మీ అంటే ఇష్టం లేదూ? మమ్మీని ఏడిపిస్తావా నాన్నా? నువ్వు రాధ

కోసం పేచీ పెడితే నేను ఎక్కడికైనా వెళ్ళిపోతాను.. వెళ్ళిపోనా?"

"నువ్వు పోవొద్దు మమ్మీ... నాకు అమ్మకూడా కావాలి మమ్మీ..." బాబిగాడు ఏడుపు గొంతుతో అన్నాడు.

రాధ అవాక్కై వుండిపోయింది.

గుమ్మం దగ్గర నిలబడివున్న రాజారావు లోపలికి వచ్చాడు.

"చూడు పద్మా! రాధ కాకపోతే మరొక పనిమనిషి తప్పదు గదా..." వాడు నీకు దూరం అయిపోతున్నాడని బాధపడటంలో అర్థంలేదు. ఆ పిల్ల ప్రేమగా చేరదీసింది గనుక మాలిమి అయ్యాడు. భార్యా భర్తలిద్దరూ వుద్యోగాలు చేసేటపుడు పెద్ద దిక్కులేని కుటుంబాలలో ఇలాటి చిన్న చిన్న సమస్యలు తప్పవు.. కాస్త సర్దుకుపోవాలి. వచ్చే సంవత్సరం బాబును స్కూల్లో వేసేద్దాం.." ఓదార్పుగా అన్నాడు.

"వీడి భవిష్యత్తు కోసమే కదండీ మన తాపత్రయం.. బాబుకు నాకన్నా ఇంకొకరు ఎక్కువ కావడం భరించలే ననిపిస్తుంది. రేపొద్దున్న రాధకు కబురు పంపించండి. మామూలుగా పనిలోకి రమ్మని.." అంది పద్మ నీరసంగా. ●